క్లుప్తంగా

నూతన ఆవిష్కరణలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ-వి ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి

తగరపువలస: విద్యార్థులు నిరంతరం ప్రయోగశాలల సాయంతో నూతన ఆవిష్కరణలు అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూ-విజయనగరం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీలో అత్యాధునిక వసతులతో కూడిన టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్సెప్చ్యువల్ లెర్నింగ్, ఇన్నోవేటివ్ థింకింగ్ అంశాల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎస్.ప్రసాదరాజు, కోశాధికారి ఎన్.కనకరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 10మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జితారా ఏఐ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వార్షిక ప్యాకేజీతో 10మంది విద్యార్థులు ఉద్యోగ అర్హత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పూర్ణ సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జాషువా తదితరులు పాల్గొన్నారు.

బంగారు రుూన్సీకి ఉత్తమ టెర్రస్ గార్డెనర్ అవార్డు



మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీకి చెందిన బంగారు రుూన్సీ ఉత్తమ టెర్రస్ గార్డెనర్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం విశాఖ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అతిథుల చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకోనున్నారు. ఈమె గత కొద్ది ఏళ్లుగా మేడపై సేంద్రియ పద్ధతుల్లో తోటలు, పంటలు పండిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఇప్పటికే పలు బహుమతులు అందుకున్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సత్కారం



పదోన్నతి పొందిన వారితో 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని ఏపీఎస్‌పీఎఫ్ పోలీస్ శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వివిధ బెటాలియన్లకు బదిలీపై వెళ్తున్న వారిని 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించే వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. మరింత సమర్థవంతంగా పనిచేసి, పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వి.నారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వానొస్తే... వణికే

చిన్నపాటి వర్షం వస్తే ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లే.. ఎవరు కొట్టుకుని పోతారో, ఎటువంటి ప్రాణ నష్టం జరుగుతుందో, ఏ వాహనం ఎటు పోతుందో తెలియని స్థితి. పరదేశిపాలెం గెడ్డతో స్థానికులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న ఇబ్బందులివి..



గెడ్డపై పారుతున్న వరద (ఫైల్)

- చిన్నపాటి వర్షానికే పొంగుతున్న గెడ్డ
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్య
- వంతెన నిర్మించాలని వినతి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెం గెడ్డపై కల్వర్టు తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షాకాలంలో స్థానికులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. చిన్నవర్షం పడినా వరదనీరు ఈ కల్వర్టుపై నుంచే ప్రవహించడంతో రాకపోకలు కష్టతరమవుతున్నాయి. కాపులుప్పాడ, రెడ్డీలపాలెం, పరదేశిపాలెం ప్రాంతాల వారు మధురవాడ, వైజాగ్ వెళ్లాలంటే ఈ గెడ్డను దాటుకుని వెళ్లాల్సిందే. సింహాచలం, మధురవాడ నుంచి వచ్చే వరదనీరు అంతా ఈ గెడ్డ నుంచే ప్రవహిస్తుంది. దీనితో వరద ఉధృతి చాలా అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఎవరైనా అటుగా ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని వెళ్లాల్సిందే.

ప్రమాదాలెన్నో..

తుఫాన్, వర్షాలు పడే సందర్భాల్లో ఈ గెడ్డపై నుంచి వరద సుమారు 4 నుండి 5 అడుగుల మేర ప్రవహిస్తుంది. ఈ క్రమంలో తెలియక ఎందరో ఈ గెడ్డలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు గెడ్డలో కొట్టుకుని పోయిన సందర్భాలు ఉన్నాయి. వరద ఉధృతి తగ్గిన తరువాత స్థానికుల సహాయంతో కొట్టుకుపోయిన వాహనాలను తీసుకొచ్చేందుకు నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యపై ఎన్నో ఏళ్ల నుండి స్థానికులు, నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వంతెన ఏర్పాటు చేయాలని ఇక్కడి వారు కోరుతున్నారు.



పరదేశిపాలెం కల్వర్టు పరిస్థితి



వరదలో కొట్టుకుపోతున్న ద్విచక్రవాహనాన్ని తీసుకుని వస్తున్న స్థానికులు (ఫైల్)

తుపాను వస్తే కష్టమే..



చిన్న పాటి వర్షానికే గెడ్డ పొంగిపోతుంది. ఇక తుపాను వస్తే అంతే సంగతులు. ఆ సమయంలో ఇక్కడి వారికి రాకపోకలు నిలిచిపోయినట్లే. అత్యవసరమైతే సాహసించి వెళ్లాల్సిందే.

– సాడి రమణ, పరదేశిపాలెం

వంతెన నిర్మించాలి



సాధారణ రోజుల్లో ఈ గెడ్డతో మాకు ఎటువంటి ఇబ్బంది లేదు కానీ, వర్షాకాలంలో ఎవరికైనా ఏ అత్యవసరమైనా వెళ్లలేని పరిస్థితి. అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా స్పందించి, వంతెన నిర్మించాలి.

–వేముల ఈశ్వర్‌రెడ్డి, కాపులుప్పాడ

వరద వస్తే కాపలా కాస్తాం..



వర్షాలు వచ్చినప్పుడు మా స్థానిక యువకులు ఇక్కడ కాపలాగా ఉంటారు. వరద ప్రవాహం తెలియక ఆటో లు, ద్విచక్రవాహనాలపై వచ్చిన వారందరూ కొట్టుకుపోతున్న సమయంలో ఇక్కడ కుర్రాళ్ళు సాహసించి కాపాడిన సందర్భాలు అనేకం.

– సన్యాసిరెడ్డి, పరదేశిపాలెం

డ్రోన్ స్ప్రేయింగ్ యంత్రాలతో దోమలకు చెక్

కొమ్మాది: నగర పరిధిలోని నీటి కొలనులో దోమలు వృద్ధి చెందకుండా డ్రోన్ స్ప్రేయింగ్ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమీషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. జోన్-2 పరిధిలోని ఎండాడ చెరువు, ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. చెరువులో దోమలు వృద్ధి చెందకుండా మలేరియా లార్వల్ ఆయిల్‌ను డ్రోన్‌ల ద్వారా వెదజల్లే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టేందుకు డ్రోన్ స్ప్రేయింగ్ యంత్రాల సహకారం అవసరమన్నారు. నీటి కొలనులో దోమల లార్వాను అరికట్టేందుకు డ్రోన్ సహకారంతో స్ప్రే చేసేందుకు వీలుగా నగరంలోని కిసాన్ డ్రోన్ స్ప్రేయింగ్ సర్వీస్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎండాడ చెరువులో వర్షపు నీరు చేరేందుకు వీలుగా సమీపంలో ఉన్న కల్వర్టులను పరిశీలించి చర్యలు చేపట్టాలని, చెరువును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో పనికిరాని వస్తువులతో తయారు చేసిన బొమ్మలు ఉండే విధంగా నిర్వహణ చేపట్టాలన్నారు. సెంటర్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలానికి వెంటనే రక్షణ గోడ నిర్మించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న అనధికారిక బడ్డీలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, ఏఎంవోహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎండాడ చెరువు వద్ద డ్రోన్ స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

విద్యార్థులు అడ్మిషన్లు పొందాలి

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి బుధవారం సూచించారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుని, అలాట్‌మెంట్ ఆర్డర్ పొందిన వారు 16వ తేదీ సాయంత్రం లోపు అలాట్‌మెంట్ ఆర్డర్, ఇతర ఒరిజినల్ ధ్రువపత్రాలతో వచ్చి చేరాలని తెలిపారు.

నేడు శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

పీఎం పాలెం: భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శిల్పారామం (జాతర)లో గురువారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. నగరానికి చెందిన జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వామ్మో.. ఎంత పెద్ద వాహనమో!

తగరపువలస: జాతీయ రహదారిపై 170 టైర్లతో పెద్ద వాహనం ఒకటి బుధవారం ఉదయం విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తూ కనిపించింది. వెనుక ఎత్తయిన, పొడవాటి వెస్సల్‌ను తీసుకుని వెళ్తోంది. దీని గమనానికి పలుచోట్ల రోడ్లపై విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డంకిగా కనిపించాయి. దాని సిబ్బంది వెస్సల్‌కు అందుబాటులో ఉన్న వైర్లకు తగలకుండా పై నుంచి వెదురు కర్రలతో ఎడం చేస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా ఫ్లై ఓవర్లపై నుంచి వెళ్తున్నప్పుడు కేబుల్ వైర్లు తాకుతూ ఇబ్బంది పెట్టాయి. మెల్లగా సాగిపోతున్న వాహనాన్ని పలువురు ఆసక్తిగా తిలకించి, తమ ఫోన్లలో బంధించారు.



తగరపువలస వెంకటేశ్వరమెట్ట జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న 170 టైర్ల వాహనం

2 వేల అడుగుల త్రివర్ణ పతాకతో ర్యాలీ నేడు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 2 వేల అడుగుల త్రివర్ణ పతాకతో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయిని వానపల్లి శైలజ తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు.

మైనింగ్ తవ్వకాలపై సీపీఎం నిరసన

రేపటి నుంచి పాదయాత్ర

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం అవుతున్న నేపథ్యంలో భీమిలి డివిజన్ సీపీఎం కమిటీ శుక్ర, శనివారాలలో పాదయాత్ర చేపట్టనుంది. ఈ మేరకు చిట్టివలస సిటూ కార్యాలయంలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి వివరాలు తెలిపారు. ఇక్కడ మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆరు గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. కాలుష్యంతో అనారోగ్యాలకు గురవుతారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే మైనింగ్ ఆర్డర్ జీవోలను నిలిపివేయాలన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి మైనింగ్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేస్తామన్నారు. సమావేశంలో జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, ముద్దాడ రాము, పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలస సిటూ కార్యాలయంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

• 'స్వాతంత్య్ర పోరాటం సాగుతూ..నే ఉంది'



స్వాతంత్య్ర పోరాటం ఇంకా సాగుతూనే ఉందని, మహిళలపై హింస ఆపాలని వైద్య విద్యార్థులు నినదించారు. కోల్‌కత్తాలో జరిగిన పీజీ ట్రెయినీ దారుణహత్యను ఖండిస్తూ మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ వైద్య కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఇండియా మ్యాప్ ఆకారంలో కొవ్వొత్తులు వెలిగించారు. మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. - మధురవాడ

తైక్వాండోలో 4 బంగారు పతకాలు

మధురవాడ: నగరంలోని మధురవాడకు చెందిన తైక్వాండో క్రీడాకారులు 4 బంగారు పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన 9వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ క్రీడాకారులు విశేష ప్రతిభ చూపారు. క్యాడెట్ 12 నుంచి 14 ఏళ్ల కేటగిరీ 60 కేజీల విభాగంలో పి.వెంకటేష్ బంగారు, 41 కిలోల విభాగంలో ఎస్.కె.హరీష్ రజత పతకాలు సాధించారు. జూనియర్స్ 15 నుంచి 17 ఏళ్ల కేటగిరీ బాలుర 41 కేజీల విభాగంలో ఎస్.నిఖిల్, 49 కిలోల విభాగంలో పి.దుర్గాప్రసాద్, 55 కిలోల విభాగంలో ఎస్.కె.రజక్, బాలికల 53 కేజీల విభాగంలో పి.సాయిభార్గవి ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. విజేతలను ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆనందరావు తదితరులు బుధవారం మధురవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు.



అతిథుల చేతుల మీదుగా పతకాలు అందుకుంటున్న మధురవాడ క్రీడాకారులు

మహాత్ముని విగ్రహంపై టీడీపీ ఫ్లెక్సీ భారం

తగరపువలస: భీమిలి జోన్ ఒకటోవార్డు టీడీపీ నాయకులు అంబేడ్కర్ కూడలిలో కట్టిన పాత ఫ్లెక్సీని జీవీఎంసీ సిబ్బంది తొలగించి అక్కడే ఉన్న గాంధీజీ విగ్రహానికి చేరవేసి వదిలేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో టీడీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలను జీవీఎంసీ సిబ్బంది పదిరోజుల క్రితం వరకు తొలగించలేదు. దీంతో ఈ నెల 3న 'కూటమి నాయకుల సేవలో భీమిలి అధికారులు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు హడావుడిగా స్పందించారు. తొలగించిన ఫ్లెక్సీని అక్కడ నుంచి తరలించకుండా గాంధీజీ విగ్రహానికి చేరవేసి వదిలేశారు. దీంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశా రు. స్వాతంత్ర దినోత్సవాల సమయంలో ఇదా ఆ యనకు ఇచ్చే గౌరవమంటూ నొచ్చుకున్నారు. ఇప్పటికే పర్యవేక్షణ లేక శిథిలమవుతున్న విగ్రహంపై ఫ్లెక్సీల భారం మోపటం ఏమిటని వాపోతున్నారు.



అంబేడ్కరు కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహంపై వాల్చి వదిలేసిన టీడీపీ ఫ్లెక్సీ

సగర్వంగా.. తిరంగా

వాడవాడలా విద్యార్థుల ర్యాలీలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మధురవాడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని, వీధుల్లో నినాదాలు చేశారు. ప్రతీ ఇంటిపై జెండాలు ఎగరవేసి దేశభక్తిని, జాతీయ భావాన్ని చాటాలని నినదించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ శిక్షకురాలు తులసి, ఉపాధ్యాయులు సోమేష్, ప్రకాశ్, పాశా తదితరులు పాల్గొన్నారు.

78 మీటర్ల జెండాతో గొట్టిపల్లి విద్యార్థుల ర్యాలీ

తగరపువలస: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం గొట్టిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సచివాలయ సిబ్బందితో కలిసి 78 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, కార్యదర్శి సురేష్‌బాబు, గ్రామ పెద్దలు యర్రా బంగారునాయుడు, దొంతల శ్రీరామ్, డబ్బీరు విజయ్ కుమార్, కోరాడ తమ్మునాయుడు, సుంకరి శివ తదితరులు పాల్గొన్నారు.

దేశంపై భక్తి, గౌరవం ఉండాలి

భీమునిపట్నం: విద్యార్థుందరిలో దేశంపై భక్తి, గౌరవం ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనుభావులను గుర్తుంచుకుని, గౌరవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి.సహదేవుడు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గొట్టిపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

- బీచ్ వద్దనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ, చెన్నా రాము పాల్గొన్నారు.

క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకం

భీమునిపట్నం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన కొసన ఆదిలక్ష్మికి కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు రూ. పది వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. చిప్పాడ గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి చిన్నప్పుడే మరణించగా, తల్లి రామసంతోషి టిఫిన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కోచ్ వాసుపల్లి ఆదినారాయణ శిక్షణలో రాణిస్తున్న ఆదిలక్ష్మి ఈ నెల 2వ తేదీన హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించింది. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన ఆమె సెప్టెంబర్ 4 నుంచి నేపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనుంది. ఆమెకు శ్రీనివాసరావు నగదు అందించి, అభినందించారు.



రూ.10 వేలు చెక్కును ఆదిలక్ష్మికి అందిస్తున్న శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

తగరపువలస: శ్రీకాకుళంలో ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెం ఈస్టర్న్ విశాఖ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో టి.భార్గవి, పి.మాళవిక, పి.అజయ్, కె.సాయికౌశిక్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె.ఆర్.సింగ్ తెలిపారు. ఎంపికైన జట్లకు 14 నుంచి 16 క్యాంపునకు కావలసిన భోజనం, వసతి, సాఫ్ట్‌బాల్ కిట్లను కరస్పాండెంట్ సమకూరుస్తున్నారు. విద్యార్థుల అభినందన సభలో డీన్ వై.చార్లెస్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.అజిత్, పీడీ ఎ.ప్రేమ్‌కుమార్, వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణ, ఎన్.సూర్య, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

104 వాహన సేవల తనిఖీ

తగరపువలస: ఆనందపురం మండలంలో 104 వాహన వైద్య సేవలను ఆరోగ్యశ్రీ పథకం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుతో పాటు వాహనం ద్వారా వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు తీరు, రికార్డులు, రోజువారీ నివేదికలను పరిశీలించారు. ఆనందపురం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్





అధినేత జగన్‌తో..

మధురవాడ/పద్మనాభం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహనరెడ్డిని పద్మనాభం ఎంపీపీ రాంబాబు, ఏపీ నగరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకురాలు లక్ష్మి పరమేశ్వరి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు కలిశారు. మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో కలిసి నియోజకవర్గంలో పరిస్థితుల గురించి చర్చించారు.